నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
17వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
మంగళవారం
07 మే 2024
పేజీలు: 02




## పాయింట్స్ టేబుల్

| టీమ్ | ఆడినవి | గెలిచినవి | ఓడినవి | రన్ రేట్ | పాయింట్స్ |
|---|---|---|---|---|---|
| కోల్‌కతా | 11 | 8 | 3 | 1.45 | 16 |
| రాజస్తాన్ | 10 | 8 | 3 | 0.62 | 16 |
| చెన్నై | 11 | 6 | 5 | 0.70 | 12 |
| హైదరాబాద్ | 11 | 6 | 5 | -0.06 | 12 |
| లక్నో | 11 | 6 | 5 | -0.37 | 12 |
| ఢిల్లీ | 11 | 5 | 6 | -0.44 | 10 |
| బెంగళూరు | 11 | 4 | 7 | -0.04 | 8 |
| పంజాబ్ | 11 | 4 | 7 | -0.18 | 8 |
| ముంబై | 12 | 4 | 8 | -0.21 | 8 |
| గుజరాత్ | 11 | 4 | 7 | -1.32 | 8 |



## డొనాల్డ్ ట్రంప్‌కు 1000 డాలర్ల జరిమానా

హష్ మనీ కేసులో అనవసర వ్యాఖ్యలు చేయకుండా జారీ చేసిన గ్యాగ్ ఉత్తర్వులను ఉల్లంఘించినందుకుగాను అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై కోర్టు మరోసారి కొరడా ఝుళిపించింది. ఆయనకు వెయ్యి డాలర్ల జరిమానా విధించింది. ఈ కేసులో గ్యాగ్ ఉత్తర్వులను 9 సార్లు ఉల్లంఘించారంటూ ట్రంప్‌నకు కోర్టు గతవారం 9 వేల డాలర్ల జరిమానా విధించిన సంగతి గమనార్హం. మరోసారి ఇలానే వ్యవహరిస్తే జైలు శిక్ష విధిస్తామంది.



## కేజ్రీవాల్‌కు కండీషన్ పెట్టిన సుప్రీంకోర్టు

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ప్రస్తుతం ఆ రాష్ట్ర సీఎం కేజ్రీవాల్ జైలులో ఉన్న విషయం తెలిసిందే. అయితే ఆయన పెట్టుకున్న బెయిల్ పిటీషన్ అభ్యర్థనపై ఇవాళ సుప్రీంలో విచారణ జరిగింది. ఈడీ కూడా తన వాదనలను వినిపించింది. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, ఒకవేళ మధ్యంతర బెయిల్‌ను మంజూరీ చేస్తే.. అప్పుడు ఎక్సైజ్ పాలసీ కేసుతో లింకున్న ఫైల్స్‌ను కేజ్రీ చూడరాదు అని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. ఒకవేళ బెయిల్ మంజూరీ చేస్తే, అప్పుడు అధికారిక డ్యూటీలను కేజ్రీవాల్ నిర్వర్తించరాదు అని కోర్టు చెప్పింది. ఫైల్స్ మీద సంతకం చేయరాదు అని కోర్టు స్పష్టం చేసింది. ఇవాళ మధ్యాహ్నం రెండు గంటలకు మళ్లీ ఈ కేసులో విచారణ చేపట్టనున్నారు. ఇవాళ మధ్యాహ్నం 2.30 నిమిషాలకు కేజ్రీ బెయిల్ గురించి సుప్రీం ఏదైనా తీర్పును ఇచ్చే అవకాశం ఉన్నది.



## పెరిగిన బంగారం ధరలు

పసిడి ధర పరుగులు పెడుతూనే ఉంది. ఇవాళ మరోసారి గోల్డ్ రేట్ పెరిగింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.330 పెరిగి రూ.72,380కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేట్ రూ.300 పెరిగి రూ. 66,350గా నమోదైంది. అటు సిల్వర్ ధర కూడా కేజీకి రూ.వెయ్యి పెరిగి రూ.88,500కి చేరింది. తెలుగు రాష్ట్రాల్లోని మిగతా ప్రాంతాల్లోనూ దాదాపు ఇవే ధరలున్నాయి.




## ఆగస్టు నుంచి దేశవ్యాప్తంగా.. బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

ప్రభుత్వ రంగంలోని భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ఎట్టకేలకు 4జీ సేవల్లోకి ప్రవేశిస్తోంది. ఆగస్టులో దేశవ్యాప్తంగా ఈ సేవలు ప్రారంభించనున్నట్టు పేరు చెప్పేందుకు ఇష్టపడని బీఎస్ఎన్ఎల్ అధికార వర్గాలు చెప్పాయి. ఇందుకు అవసరమైన టెక్నాలజీని బీఎస్ఎన్ఎల్ పూర్తిగా దేశీయంగా సమకూర్చుకుంటోంది. సీ-డాట్, టీసీఎస్, ఐటీఐ సమకూర్చిన సాఫ్ట్‌వేర్, పరికరాలతో కంపెనీ గత ఏడాది కాలంగా పంజాబ్ సర్కిల్‌తో పాటు మరికొన్ని సర్కిళ్లలో 4జీ సేవలు అందిస్తోంది. ఈ పరీక్షలు విజయవంతం కావడంతో ఆగస్టులో దేశ వ్యాప్తంగా ఈ సేవలు ప్రారంభించాలని యోచిస్తోంది. ఈ 4జీ పరికరాలను అవసరమైతే 5జీ సేవలకు కూడా అప్‌గ్రేడ్ చేయవచ్చని బీఎస్ఎన్ఎల్ వర్గాలు చెప్పాయి. దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్‌తో కలిసి, కేంద్ర ప్రభుత్వ రంగ పరిశోధనా సంస్థ `సీ-డాట్`.. అభివృద్ధి చేసిన దేశీయ టెక్నాలజీతో పంజాబ్‌లో ఇప్పటికే 4జీ సేవలను బీఎస్ఎన్ఎల్ అందుబాటులోకి తెచ్చింది. సీ-డాట్ డెవలప్ చేసిన టెక్నాలజీ.. పంజాబ్‌లో మెరుగైన సేవలు అందిస్తున్నదని బీఎస్ఎన్ఎల్ సీనియర్ అధికారులు చెప్పారు. ఇక దేశమంతా 4జీ నెట్‌వర్క్ విస్తరణకు టీసీఎస్, తేజస్, ప్రభుత్వ రంగ `ఐటీఐ` కలిసి బీఎస్ఎన్ఎల్ నుంచి రూ.19 వేల కోట్ల విలువైన ఆర్డర్‌ను పొందాయి.



## కొనసాగుతున్న మూడో విడత పోలింగ్..
# ఓటేసిన ప్రముఖులు

సార్వత్రిక ఎన్నికలకు మూడో విడత పోలింగ్ కొనసాగుతున్నది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగనుంది. దీంతో పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్దకు చేరుకుని ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. ఇక సామాన్య ప్రజలతోపాటు పలువురు ప్రముఖులు కూడా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిల్చొని ఓటు వేశారు. ఈ సందర్భంగా దేశ ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. మూడో విడత పోలింగ్ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పోలింగ్ ప్రారంభమైన తొలి గంటలోనే ఓటు వేశారు. గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్ పరిధిలోని అహ్మదాబాద్‌లో ఉన్న నిషాన్ హైస్కూల్‌లో ప్రధాని మోదీ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా కేంద్ర హోం శాఖ మంత్రి, గాంధీనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అమిత్ షా సైతం తన కుటుంబంతో కలిసి అహ్మదాబాద్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. సతీమణి సోనాల్ షా, కుమారుడు, బీసీసీఐ కార్యదర్శి జైషా ఇతర కుటుంబ సభ్యులతో కలిసి ఓటేశారు.ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, యూపీ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ విదిశ లోక్‌సభ అభ్యర్థి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రులు మన్‌సుఖ్ మాండవీయ, ప్రహ్లాద్ జోషీ, జ్యోతిరాదిత్య సింధియా, బారామతి ఎంపీ అభ్యర్థులు సుప్రియా సూలే, సునేత్ర పవార్, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్, ఎన్‌సీపీ – ఎస్‌సీపీ చీఫ్ శరద్ పవార్, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటేసిన సినీ నటి జెనీలియా

సార్వత్రిక సమరంలో మూడో దశ పోలింగ్ కొనసాగుతోంది. మహారాష్ట్రలోని లాతూర్ లో ఓటు హక్కు వినియోగించుకున్నారు సినీ నటి జెనీలియా. ప్రజాస్వామ్యంలో ఇవాళ అతి ముఖ్యమైన రోజు అని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కను వినియోగించుకోవాలని కోరారు. జెనీలియాతో పాటు తన భర్త దేశ్ ముఖ్ ఓటు వేశారు.




## ఏపీలో ఈసీ తీరుపై వైసీపీ ఆగ్రహం

ఏపీలో ఎన్నికల సంఘం (ఈసీ) తీరుపై వైసీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో ప్రభుత్వ పథకాల నిధుల విడుదలకు ఈసీ అనుమతి నిరాకరించిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు నిధుల విడుదలకు ఈసీ బ్రేకులు వేసింది. ఏపీలో మాత్రం ఈసీ ఎందుకు వివక్ష చూపుతోందని వైసీపీ నిలదీసింది. ఈసీ నిర్ణయాల వెనుక కుట్ర ఉందని సజ్జల రామకృష్ణ ఆరోపించారు.



## ఒకే కాన్పులో ఐదుగురు ఆడబిడ్డలకు జన్మనిచ్చిన మహిళ

బిహార్‌లోని కిషన్‌గంజ్ జిల్లాలో తాజాగా షాకింగ్ ఘటన జరిగింది. ఓ మహిళ ఒకే కాన్పులో అయిదుగురు ఆడబిడ్డలకు జన్మనిచ్చింది. అయిదుగురు శిశువులూ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు చెప్పారు. కిషన్‌గంజ్ జిల్లాలోని ఠాకుర్‌గంజ్‌కు చెందిన తాహీరా బేగం గర్భంలో అయిదుగురు శిశువులు ఉన్నట్లు వైద్యులు ముందే గుర్తించారు. ఆమెకు పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు ఠాకుర్‌గంజ్ కమ్యూనిటీ ఆరోగ్యకేంద్రానికి తీసుకువచ్చారు. అక్కడి వైద్యులు సురక్షితంగా ప్రసవం చేశారు.

## వన్ జెర్సీ వన్ నేషన్

వెస్టిండీస్, అమెరికా వేదికలుగా జూన్ 1 నుంచి జరుగనున్న ప్రతిష్ఠాత్మక టీ20 ప్రపంచకప్ టోర్నీకి భారత క్రికెట్ జట్టు కొత్త జెర్సీని విడుదల చేసింది. అధికారిక కిట్ స్పాన్సర్ అయిన అడిడాస్..ధర్మశాల స్టేడియం బ్యాక్‌డ్రాప్‌తో రోహిత్‌శర్మ, జడేజా, కుల్దీప్‌యాదవ్ కనిపిస్తున్న ఓ వీడియోను 'వన్ జెర్సీ వన్ నేషన్' స్లోగన్‌తో సోమవారం విడుదల చేసింది. నారింజ, నీలం రంగుల కలయికతో కూడిన జెర్సీకి వీ ఆకారంలో త్రివర్ణ రంగులతో రూపొందించారు. అయితే దీనిపై అభిమానుల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతున్నది. 2019 వన్డే ప్రపంచకప్ జెర్సీని పోలి ఉందని కొందరు అంటే బీజేపీ పార్టీ రంగుల్లో ఉందని కొందరు విమర్శలకు దిగారు.






## చరిత్రలోనే 2024 అత్యంత వేడి సంవత్సరం

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో 2024 చరిత్రలోనే తొలి 5 అత్యంత తీవ్ర ఉష్ణ సంవత్సరాల్లో ఒకటిగా నిలుస్తున్నట్లు 'క్లైమేట్ ట్రెండ్స్' సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో 2023 జూన్ నుంచి ప్రతినెలా రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది. భారతదేశం వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థకు జరుగుతున్న ఓటింగ్, అభ్యర్థుల ప్రచారంపై వాతావరణ మార్పుల ప్రభావం ఉందని పేర్కొంది.



## ఈషా హాట్ ట్రీట్

బాలీవుడ్ నటి ఈషా గుప్తా బోల్డ్ లుక్స్‌కి ప్రత్యేకించి ఫాలోయింగ్ ఉంది. సోషల్ మీడియాల్లో ఈ బ్యూటీ నిరంతర ఫోటోషూట్లకు జనాదరణ అసాధారణం. తాజాగా రేసీ ఫోటోషూట్ నుండి రకరకాల భంగిమల్లో ఫోజులిచ్చిన ఇషా గుప్తా. ఫోటో లీక్‌లతో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. 38 ఏళ్ల ఇషా హాట్ ఇమేజెస్ బంచ్ ని పోస్ట్ చేసింది. ఈ ఫోటోషూట్ లో పాస్టెల్ నియాన్ గ్రీన్ ప్యాంట్‌సూట్-స్ట్రాప్‌లెస్ టాప్ లో ఇన్నర్ అందాలు వెదర్ ని హీటెక్కించాయి. దీనికి హాయ్ అని సింపుల్ క్యాప్షన్ ఇచ్చింది ఈషా.

## స్వల్ప లాభాల్లో స్టాక్ మార్కెట్ సెన్సెక్స్ @73,960

మన మార్కెట్లు నేడు ఫ్లాట్‌గా ప్రారంభమయ్యాయి. ఉదయం 9:27 గంటల సమయంలో సెన్సెక్స్ 67 పాయింట్ల లాభంతో 73,963 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 35 పాయింట్లు పెరిగి 22,484 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.58 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్, పవర్‌గ్రిడ్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటార్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎం అండ్ ఎం, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, రిలయన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ఉన్నాయి. హెచ్‌యూఎల్, ఐటీసీ, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్, విప్రో, ఎల్ అండ్ టీ, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, టైటన్, టీసీఎస్, సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా షేర్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.



సూర్య www.suryaa.com EVENING EDITION 4 PM



## బెంగాల్‌లో కుండపోత వర్షం.. 12 మంది మృతి

గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదైన పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సోమవారం సాయంత్రం ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు ఈదురుగాలులతో కూడి భారీ వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. ఈ వర్షానికి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.ఇక భారీ వర్షం కారణంగా రాష్ట్రంలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. పుర్బా బుర్ద్వాన్‌లో ఐదుగురు, పశ్చిమ్ మెదినీపూర్‌లో ఇద్దరు, పురూలియాలో ఇద్దరు ప్రాణలు కోల్పోయినట్లు చెప్పారు. నదియాలో గోడ కూలి ఇద్దరు, దక్షిణ 24 పరగణాల జిల్లాలో చెట్టుకూలి ఒకరు మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వర్షాల కారణంగా మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు వెల్లడించారు.



## కుల్గామ్‌లో ఎన్‌కౌంటర్.. ముగ్గురు ఉగ్రవాదులు హతం

జమ్మూ కశ్మీర్‌లోని కుల్గామ్‌లో మంగళవారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. కుల్గామ్‌లోని రెడ్‌వానీ ప్రాంతంలో ఉగ్రవాదులు నక్కి ఉన్నారని ముందుగా సమాచారం అందుకున్న భద్రతా దళాలు సోమవారం అర్ధరాత్రి వారి కోసం గాలింపు ప్రారంభించారు. ఈ గాలింపులో ఉగ్రవాదుల కదలికలను గుర్తించిన భద్రతా దళాలు వారిపై కాల్పులు జరిపి ముగ్గురిని మట్టుబెట్టారు. ప్రస్తుతం అక్కడ గాలింపు కొనసాగుతోంది.

## ZEE మీడియా సీఈఓ అభయ్ పై వేటు

ZEE మీడియా కార్పొరేషన్‌కు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా ఉన్న అభయ్ ఓజాను ఆ సంస్థ తాజాగా తొలగించింది. మే 4న జరిగిన బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని జీ మీడియా సోమవారం రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. కాగా.. అభయ్ తొలగింపునకు కారణాలను వెల్లడించలేదు.



# పవన్‌ను గెలిపించండి.. సేవకుడిగా అండగా ఉంటాడు

## చిరంజీవి

తన కంటే జనం గురించి ఎక్కువగా ఆలోచించే మనస్తత్వం జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ది అని ఆయన సోదరుడు, ప్రముఖ నటుడు చిరంజీవి అన్నారు. ఒకరకంగా చెప్పాలంటే అతడు సినిమాల్లోకి బలవంతంగానే వచ్చినా.. రాజకీయాల్లోకి మాత్రం ఇష్టంతో వచ్చారని చెప్పారు. 'జనమే జయం' అని నమ్మే జనసేనానిని గెలిపించాలని పిఠాపురం ప్రజలను కోరారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ వీడియోను చిరంజీవి పోస్ట్ చేశారు.
"అమ్మ కడుపున ఆఖరి వాడిగా పుట్టినా అందరికీ మంచి చేయాలి.. మేలు జరగాలి అనే విషయంలో ముందుంటాడు. తన గురించి కంటే జనం గురించి ఎక్కువగా ఆలోచించే మనస్తత్వం నా తమ్ముడిది. ఎవరైనా అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఏమైనా చేయాలనుకుంటారు. కానీ.. పవన్ కల్యాణ్ తన సొంత సంపాదనను కౌలు రైతుల కన్నీళ్లు తుడిచేందుకు ఖర్చు పెట్టడం, సరిహద్దుల్లో ప్రాణాలకు తెగించి పోరాడే జవాన్ల కోసం పెద్ద మొత్తం అందించడం, మత్స్యకారులకు సాయం చేయడం చూస్తుంటే ఇలాంటి నాయకుడు కదా జనాలకు కావాల్సింది అనిపిస్తోంది. ఏ తల్లికైనా తన కుమారుడు కష్టపడుతుంటే గుండె తరుక్కుపోతుంది. ఏ అన్నకైనా తన తమ్ముడు అనవసరంగా మాటలు పడుతుంటే బాధేస్తుంది. అలా బాధ పడుతున్న నా తల్లికి ఒక మాట చెప్పా. నీ కొడుకు ఎంతో మంది తల్లుల కోసం, వాళ్ల బిడ్డల భవిష్యత్తు కోసం చేసే యుద్ధం ఇది చెప్పాను. మన బాధ కంటే అది ఎంతో గొప్పది అన్నాను. అన్యాయాన్ని ఎదిరించకుండా మౌనంగా ఉండే మంచి వాళ్ల వల్లనే ప్రజాస్వామ్యానికి మరింత నష్టమని నమ్మి జనం కోసం జన సైనికుడయ్యాడు. తాను బలంగా నమ్మిన సిద్ధాంతం కోసం తన జీవితాన్ని రాజకీయాల కోసం అంకితం చేసిన శక్తిశాలి పవన్ కల్యాణ్. రాష్ట్ర భవిష్యత్తు కోసం శక్తిని వినియోగించాలి అంటే చట్టసభల్లో అతడి గొంతును మనం వినాలి. 'జనమే జయం' అని నమ్మే జనసేనాని ఏం చేయగలడో చూడాలంటే పిఠాపురం ప్రజలు పవన్‌కల్యాణ్‌ను గెలిపించాలి. మీకు సేవకుడిగా, సైనికుడిగా అండగా నిలబడతాడు. మీ కోసం కలబడి మీ కలలను నిజం చేస్తాడు. గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి పవన్‌ను గెలిపించండి" అని చిరంజీవి కోరారు.

# వరల్డ్‌కప్ గెలవాలంటే రోహిత్ శర్మ కీలకం

## 2024 టీ20 వరల్డ్‌కప్ బ్రాండ్ అంబాసిడర్‌గా యువీ

భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ మరోసారి రోహిత్ శర్మపై తన అభిమానాన్ని చాటుకున్నాడు. 2024 టీ20 వరల్డ్‌కప్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న యువీ ప్రస్తుతం టోర్నమెంట్ ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నాడు. ఈ సందర్భంగా ఒక ఐసీసీ ఈవెంట్‌లో యువరాజ్ మాట్లాడుతూ.. భారత్ వరల్డ్‌కప్ నెగ్గాలంటే కెప్టెన్ రోహిత్ శర్మ కీలకం అని అన్నాడు. రోహిత్ తప్పనిసరిగా టీమిండియాకు టైటిల్ అందిస్తాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ పొట్టి ప్రపంచకప్ కోసం ప్రకటించిన జట్టు కూడా బాగుందని, సారథిగా హిట్‌మ్యాన్ ముందుండి టీమ్‌ను నడిపిస్తాడని చెప్పుకొచ్చాడు. క్రికెట్‌లో తనకున్న అతి కొద్దిమంది స్నేహితుల్లో రోహిత్ ఒకడని తెలిపాడు. ఈ సందర్భంగా భారత కెప్టెన్‌కు ఆల్ ది బెస్ట్ చెప్పాడు యువీ. యువరాజ్ ఇంకా మాట్లాడుతూ.. "ఒత్తిడి అధికంగా ఉండే పొట్టి వరల్డ్‌కప్‌లో సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకునే కెప్టెన్ అవసరం. మనకు సరిగ్గా అలాంటి కెప్టెనే ఉన్నాడు. ఎంత సక్సెస్ అయినా ఇప్పటికీ రోహిత్‌లో మార్పు లేదు. మైదానంలో ముందుండి నడిపిస్తాడు. బయట అందరితో సరదాగా ఉంటాడు. క్రికెట్‌లో తను నాకు ఆప్తమిత్రుడు. గతేడాది స్వదేశంలో జరిగిన 50 ఓవర్ల ప్రపంచకప్ లో ఫైనల్ వరకు జట్టును తీసుకెళ్లాడు. ఐదు ఐపీఎల్ టైటిళ్లు గెలిచాడు. నాకు తెలిసి టీమిండియాకు రోహిత్ లాంటి మంచి కెప్టెన్ కావాలి" అని యువరాజ్ చెప్పుకొచ్చాడు.





## నిలిచిపోయిన సునీతా విలియమ్స్ రోదసి యాత్ర

భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్‌రోదసి యాత్ర నిలిచిపోయింది. వారు వెళ్లాల్సిన బోయింగ్ స్టార్‌లైనర్ వ్యోమనౌకను మోసుకెళ్లాల్సిన రాకెట్‌లో సాంకేతికత లోపం తలెత్తడమే దీనికి కారణం. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8.04 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లాల్సి ఉంది. కానీ, చివర్లో గుర్తించిన లోపం కారణంగా ప్రస్తుతానికి ఈ మిషన్‌ను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్రకటించింది. తిరిగి ఎప్పుడు చేపడతారనేది మాత్రం వెల్లడించలేదు.
ఫ్లోరిడాలోని కేప్ కెనావెరాల్‌లో ఉన్న కెన్నెడీ స్పేస్ సెంటర్ నుంచి బోయింగ్‌కు చెందిన అట్లాస్ V రాకెట్ నింగిలోకి దూసుకెళ్లడానికి సిద్ధమైంది. సరిగ్గా 90 నిమిషాల ముందు మిషన్‌ను ఆపేస్తున్నట్లు నాసా ప్రకటించింది. రాకెట్‌లోని ఆక్సిజన్ రిలీఫ్ వాల్వ్ పనితీరు అసాధారణంగా ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. అప్పటికే వ్యోమనౌకలోకి ప్రవేశించిన సునీతా విలియమ్స్‌తో పాటు మరో వ్యోమగామి బుచ్ విల్‌మోర్‌ను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. తాజా మిషన్‌లో భూకక్ష్యలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో వారం పాటు బసచేయాలనేది ప్రణాళిక. స్టార్‌లైనర్ అభివృద్ధిలో అనేక ఇబ్బందులు తలెత్తాయి. 2019లో ప్రయోగాత్మకంగా చేపట్టిన స్టార్‌లైనర్ తొలి మానవరహిత యాత్ర ఐఎస్ఎస్‌ను చేరుకోలేకపోయింది. మరో యాత్రలో పారాచూట్ సమస్యలు తలెత్తాయి. దీనివల్ల ఈ ప్రాజెక్టులో చాలా సంవత్సరాలు జాప్యం జరిగింది. స్టార్‌లైనర్‌తో మానవసహిత యాత్ర నిర్వహించడం ఇదే మొదటిసారి. తాజాది విజయవంతమైతే ఐఎస్ఎస్‌కు వ్యోమగాములను చేరవేసే రెండో వ్యోమనౌక అమెరికాకు అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం స్పేస్‌ఎక్స్ వ్యోమనౌక ఈ సేవలు అందిస్తున్న విషయం తెలిసిందే. మిషన్ పైలట్‌గా వ్యవహరించాల్సిన సునీతకు ఇది మూడో అంతరిక్ష యాత్ర. గతంలో ఆమె 2006, 2012లో రోదసిలోకి వెళ్లారు. మొత్తం 50 గంటల 40 నిమిషాల పాటు స్పేస్‌వాక్ నిర్వహించారు. 322 రోజులపాటు అంతరిక్షంలో గడిపారు. మునుపటి యాత్రలో భగవద్గీతను తీసుకెళ్లిన ఆమె ఈసారి తన ఆరాధ్య దైవం గణపతి విగ్రహాన్ని వెంట పట్టుకెళ్లనున్నట్లు వెల్లడించారు. స్టార్‌లైనర్‌కు ఇది మొదటి మానవసహిత యాత్ర కావడం వల్ల ఒకింత ఆత్రుతగా ఉందని అంతకుముందు వెల్లడించారు. అయినప్పటికీ గాబరా పడిపోయే పరిస్థితి ఏమీ లేదని చెప్పారు.



## అందుకే ఏపీలో విపక్షాలన్నీ కలిశాయి..

### హోం మంత్రి తానేటి వనిత ఆసక్తికర వ్యాఖ్యలు

రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ శ్రీలంక అయిపోతుందంటూ నానా యాగీ చేసి, ఇప్పుడు అవే పథకాలు రెట్టింపు ఇస్తామంటూ టీడీపీ మభ్యపెడుతోందన్నారు హోం మంత్రి తానేటి వనిత. సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే సత్తాలేకనే విపక్షపార్టీలన్నీ కలిసి కూటమిగా వస్తున్నాయన్నారు. 2014లో అసత్యాలు చెప్పి అధికారంలోకొచ్చినట్లే మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు తానేటి వనిత. జగనన్న వస్తే మీ భూమి లాక్కుంటాడని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ గురించి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, దీనిపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి పోలీసులు నోటీసులు కూడా ఇచ్చారన్నారు హోంమంత్రి. కొవ్వూరు నియోజకవర్గంతో పాటు గోపాలపురం నియోజకవర్గం కూడా ప్రజలు కూడా తనను ఆదరిస్తారని, జగనన్న అభీష్టం మేరకే గోపాలపురంలో పోటీచేస్తున్నానన్నారు తానేటి వనిత. గోపాలపురం ప్రజలు తనని గుండెల్లో పెట్టుకుంటున్నారని చెప్పారు తానేటి వనిత.







## హీట్ సమ్మర్ లో బికినీతో దిశాపటానీ అందాల ట్రీట్

చేతినిండా సినిమాలు ఉన్నా కూడా తన ఉనికి చాటుకోవడం కోసం దిశాపటానీ అందాలను మాత్రమే నమ్ముకుంటుంది. అందులో భాగంగా తీరైన శరీర సౌష్టవంతో ఉన్న తన పిక్స్‌ను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ... గ్లామర్ పోజులతో మతులు పోగొడుతోంది దిశాపటానీ. తాజాగా మరోసారి బీచ్‌లో బికినీతో మరోసారి రెచ్చిపోయింది. తీరైన శరీర సౌష్టవంతో దిశా పటానీ.. బికినీలో యమ హాటుగా..



## సీఎం జగన్ కీలక వ్యాఖ్యలు

ప్రభుత్వ పథకాల నిధులను ఎన్నికల సంఘం (ఈసీ) అడ్డుకోవడంపై సీఎం జగన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కోరుకొండ రోడ్ షోలో సీఎం జగన్ మాట్లాడుతూ.. 'ఢిల్లీ వాళ్లతో కలిసి కుట్రలు చేస్తున్నారు. ప్రజలకు మంచి జరగనివ్వకుండా ఆపుతున్నారు. వీళ్లు పథకాలను అడ్డుకున్నా.. మీ బిడ్డ విజయాన్ని ఎవరూ ఆపలేరు. జూన్ 4న మళ్లీ అధికారంలోకి వస్తాం. అప్పుడు వెంటనే బటన్లన్నీ నొక్కుతా.' అని అన్నారు.

## మొదటి GST ట్రిబ్యునల్ అధ్యక్షుడిగా సంజయ్ కుమార్ మిశ్రా



మొదటి GST అప్పిలేట్ ట్రిబ్యునల్ అధ్యక్షుడిగా జస్టిస్ (రిటైర్డ్) సంజయ్ కుమార్ మిశ్రా సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మిశ్రాతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రమాణ స్వీకారం చేయించారు. సెంట్రల్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ యాక్ట్ కింద ఈ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశారు. GST అమల్లోకి వచ్చిన 7 ఏళ్ల తరువాత ఈ ట్రిబ్యునల్ అందుబాటులోకి వచ్చింది.